



సిద్దిపేటలో అగ్నిప్రమాదంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

నిర్లక్ష్యపు మంటలు

విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణలో డొల్లతనం బట్టబయలైంది. నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన విద్యుత్ యంత్రాంగంలోనూ లోటుపాట్లు కనిపిస్తున్నాయి. బుధవారం రాత్రి సిద్దిపేటలోని 200 కేవీ సబ్‌స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం జరగడం వీరి అప్రమత్తతను ప్రశ్నిస్తోంది. పర్యవేక్షణ లోపించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సిద్దిపేట సబ్‌స్టేషన్‌తో పాటు జిల్లాలోని పలు సబ్‌స్టేషన్లలోనూ సమస్యలు నెలకొన్నాయి. గురువారం 'ఆంధ్రజ్యోతి' జరిపిన పరిశీలనలో నిజనిజాలు వెలుగుచూశాయి.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 22



బెజ్జంకి మండలం దాచారం సబ్‌స్టేషన్‌లో తుప్పుపట్టి కనిపిస్తున్న అగ్నిమాపక సామగ్రి

డేంజర్ జోన్‌లో సబ్‌స్టేషన్లు!

- అగ్ని ప్రమాదంతో లోటుపాట్లు బట్టబయలు
- కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లతో ముప్పు
- పలుచోట్ల నిర్వహణలోనూ లోపాలు
- వేసవిలో మరిన్ని సమస్యలొచ్చే అవకాశాలు
- జిల్లావ్యాప్తంగా 'ఆంధ్రజ్యోతి' పరిశీలన

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా 176 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ప్రతీ సబ్‌స్టేషన్‌కు ఒక వాచ్‌మెన్ ఉండాలి. కానీ లేరు. నిరంతరం సబ్‌స్టేషన్‌ను నిర్వహించడానికి నలుగురు ఆపరేటర్లు ఉండాలి. కానీ ముగ్గురు మాత్రమే ఉన్నారు. 2000 సంవత్సరం కంటే ముందు ఉన్న సబ్‌స్టేషన్లలో కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. సాధారణంగా 15 నుంచి 20 ఏళ్ల గడువులో ఈ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాల్సి ఉంటుందని చెబుతున్నారు. అయితే పూర్తిస్థాయిలో కాలం చెల్లినా పాత ట్రాన్స్‌ఫార్మర్లతోనే నడిపిస్తున్నారు. బుధవారం సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో చోటుచేసుకున్న ప్రమాదం కూడా కాలంచెల్లిన ట్రాన్స్‌ఫార్మర్ కారణంగానే జరిగినట్లు ప్రాథమిక అంచనాలో తేలింది. 1997లో అమర్చిన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తుంది. సబ్‌స్టేషన్లలో ఉన్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని ఆపరేటర్లు వాపోతున్నారు. ప్రతీ సబ్‌స్టేషన్‌లో నీటి వసతి తప్పనిసరిగా ఉండాలి. కానీ పలుచోట్ల నీటి కొరత వేధిస్తోంది.

వెలుగులోకి లోటుపాట్లు..

- తొగుట మండలం మెట్టు సబ్‌స్టేషన్ నుంచి పెద్ద మాసాన్‌పల్లి ఫీడర్‌కు అవుట్‌గోయింగ్ ఏబీ స్విచ్ లేకపోవడం వల్ల ఇప్పటికే రెండుసార్లు ప్రమాదాలు జరిగాయి. అయినా ఇప్పటివరకు పరిష్కారం చూపలేదు.
- కొండపాక మండలం సిర్సనగండ్ల, బందారం, కొండపాక సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడుతునందున అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమని ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు.
- నంగునూరు మండలం రాంపూర్ చౌరస్తాలోని సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ లీక్ అవుతున్నది. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిని మార్చడానికి ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసినా జాప్యం జరుగుతోంది.
- నారాయణరావుపేట మండలంలోని పలు సబ్‌స్టేషన్ల ఆవరణలో లైటింగ్ సమస్య ఉంది. రాత్రివేళల్లో విద్యుత్ బ్రేకర్స్ ట్రిప్ అయినప్పుడు సబ్‌స్టేషన్ లోనికి వెళ్లేందుకు ఆపరేటర్లు ఇబ్బంది పడుతున్నారు.
- మిరుదొడ్డి మండలం కాసులాబాద్, ధర్మారం, అందె, మిరుదొడ్డి సబ్‌స్టేషన్లలో నీటివసతి లేదు. ఎర్త్‌పైపులో నీళ్లను నిల్వ ఉంచడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ కూలింగ్ అవుతుంది. లేకుంటే హీటెక్కి కాలిపోతాయి.
- సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సబ్‌స్టేషన్‌లో 2001 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌నే కొనసాగిస్తున్నారు.
- బెజ్జంకి మండలం దాచారం గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో అగ్నిమాపక సామగ్రి తుప్పుపట్టి దర్శనమిస్తుంది.
- సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ సబ్‌స్టేషన్‌లో 16ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది.
- రాయపోల్ సబ్‌స్టేషన్‌లో సుమారు 15 ఏళ్ల క్రితం అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ నుండి గద్దెపై ఆయిల్ లీక్ అవుతున్నది.



నంగునూరు మండలం రాంపూర్ చౌరస్తాలోని సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి లీకవుతున్న ఆయిల్



మిరుదొడ్డి మండలం ధర్మారం సబ్‌స్టేషన్‌లో నీటికొరతతో ఖాళీగా కనిపిస్తున్న ఎర్త్‌పైపు నీటితొట్టి



రాయపోల్ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ లీకేజీ

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేట సబ్‌స్టేషన్ సందర్శన

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 22 : జిల్లా రైతులకు, విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆయన సిద్దిపేటలో ప్రమాదానికి గురైన సబ్‌స్టేషన్‌ను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే హైదరాబాద్‌లోని ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి, కలెక్టర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, అగ్నిమాపకశాఖ అధికారులను ఫోన్ చేసి అప్రమత్తం చేశామన్నారు. ప్రమాదం జరిగిన ఆరు గంటల్లోనే విద్యుత్‌ను పునరుద్ధరించిన అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారులను ఆయన అభినందించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్లు జిల్లాలో ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని మంత్రి పొన్నం ఆదేశించారు. మంత్రి వెంట విద్యుత్‌శాఖ జిల్లా అధికారి మహేష్‌కుమార్, నాయకులు తుంకుంట నర్సారెడ్డి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నాయకులు బొమ్మల యాదగిరి, దరిపల్లి చంద్రం, నాయిని నరసింహారెడ్డి, సూర్యవర్మ, మహేందర్, మార్క సతీశ్, గయాస్, గుర్రం అంజిరెడ్డి, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, విద్యుత్‌శాఖ జిల్లా అధికారి మహేశ్‌కు సూచనలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

మున్సిపల్ బడ్జెట్‌లకు గ్రీన్‌సిగ్నల్

- సిద్దిపేట రూ.98.51 కోట్లు
- రూ.18.55 కోట్లతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్
- సిద్దిపేటలో అదనపు కలెక్టర్ హాజరు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 22 : 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు ఆధ్వర్యంలో రూ.98.51 కోట్ల మున్సిపల్ బడ్జెట్‌ను గురువారం ప్రవేశపెట్టారు. దీనికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ హాజరై మాట్లాడారు. సిద్దిపేట మున్సిపాలిటీ ఇంత మంచి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు పాలకవర్గ సభ్యులను, అధికారులను అభినందించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు సిద్దిపేట మున్సిపాలిటీ ఎప్పుడూ ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు మాట్లాడారు. వార్షిక బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం తెలిపిన పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సహాయ సహకారాలు, కృషితో సిద్దిపేట పట్టణం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కమిషనర్ ప్రసన్నరాణి, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ మల్లికార్జున్, మేనేజర్‌శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోరం లేకున్నా..

గజ్వేల్, ఫిబ్రవరి 22: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బడ్జెట్ ఎట్టకేలకు ఆమోదం పొందింది. కోరం లేకున్నా మున్సిపల్ యాక్టు ప్రకారం బడ్జెట్‌ను ఆమోదించారు. గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అధ్యక్షతన కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆధ్వర్యంలో అకౌంట్స్ అధికారి రాకేశ్ 2024-25 మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.18.55 కోట్ల అంచనాతో రూ.27.86 లక్షల మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఈబడ్జెట్ సమావేశానికి మొత్తం 20 మంది సభ్యులకు కేవలం ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. మున్సిపల్ యాక్టు - 2020 ప్రకారం బడ్జెట్‌ను కోరం లేకుండా వాయిదా వేసిన అనంతరం 24 గంటల్లో కోరంతో సంబంధం లేకుండా ఆమోదించే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఉప్పల మెట్టయ్య, అబ్దుల్ రహీం, తలకొక్కుల భాగ్యలక్ష్మి, షెరీఫా ఉమర్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను చేధించాలి

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ అనురాధ

గజ్వేల్, ఫిబ్రవరి 22 : పెండింగ్ కేసులను త్వరితగతిన చేధించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గజ్వేల్ డివిజన్ పోలీస్ అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి ఏసీపీ, సీఐలను, ఎస్ఐలను అడిగితెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, పేకాట, జూదం తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాటిని అరికట్టాలని సూచించారు. సైబర్ నేరాల్లో ఫ్రీజ్ అయిన నగదును త్వరగా బాధితులకు ఇప్పించాలని సూచించారు. అలాగే, గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డి, గజ్వేల్ ఏసీపీ బాలాజీ, సైబర్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి సైబర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, గజ్వేల్ డివిజన్ ఎస్ఐలు, ఐటీ కోర్, సీసీఆర్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లూ జాగ్రత్త!

- వారికి వాహనాలు ఇస్తే ముప్పు తప్పదు
- వాహన యజమానిపై చర్యలు
- ఉల్లంఘనను కోర్టులు తీవ్రంగా పరిగణించే అవకాశం
- కొత్త విధానం కొనసాగించడానికి పోలీసుల కసరత్తు
- జిల్లాలో గతేడాది 798, ఈ ఏడాది ఇప్పటివరకు 138 కేసులు



సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 22: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా బైకులు, కార్లను నడిపే మైనర్లపై పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులను జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో గతంలో మైనర్ డ్రైవింగ్ పలువురి ప్రాణాలను తీసింది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మైనర్ డ్రైవింగ్ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. దీనికి సంబంధించిన కేసుల్లో వాహన యజమానిపై కేసు నమోదుచేసి కోర్టుకు పంపేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విధానాన్ని మరి కొద్దిరోజుల్లో అమలులోకి తీసుకురానున్నారు.



ఫైల్

936 కేసులు నమోదు

సిద్దిపేట జిల్లాలో మైనర్ డ్రైవింగ్ సంఘటనలపై పోలీసులు ఈ-చలాన్ కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. 2023లో 798 కేసులు నమోదు చేసి ఈ-చలాన్ ద్వారా రూ.3,97,000 జరిమానా విధించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 138 కేసులు నమోదుచేసి రూ.64 వేల జరిమానా విధించారు. జిల్లాలో మైనర్లు బైక్ రేసింగ్‌లలో పాల్గొంటున్నారనే సమాచారం మేరకు చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతున్నది.

బైక్ కొనివ్వాలని పిల్లల ఒత్తిడి

బైకులు, కార్లు నడుపుతున్న కొంతమంది యువకులు ఇంట్లో తల్లిదండ్రులను బైకులు కొనివ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. స్నేహితులందరూ కొత్త బైకులు కొనుక్కున్నారని, మేము కాలేజీకి బస్సులో వెళ్తే పరువుపోతుందని గొడవ చేస్తున్నారు. అలాంటివారు మొదట పోలీసులకు పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. మరోసారి పట్టుపడితే జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు. అలాగే ప్రైవేట్ సంస్థలు మొబైల్ యాప్ ద్వారా బైకులు, కార్లు కిరాయికి ఇవ్వొద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించిన కేసులు అరుదుగా నమోదు చేశారు. ప్రస్తుతం మోటార్ వాహన చట్టం 180 ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు.

మోటార్ వాహనచట్టం 180

మోటార్ వాహనాల చట్టంలోని 180వ సెక్షన్ ప్రకారం ఒక మైనర్ కానీ, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తి వాహనం నడిపితే అతడితో పాటు వారికి వాహనం ఇచ్చిన యజమానిని బాధ్యుడిని చేసే అవకాశం ఉన్నది. మైనర్ వాహనం ప్రమాదానికి గురైతేనే కాదు.. పోలీసుల తనిఖీల్లో దొరికినా తిప్పలు తప్పవు. 180వ సెక్షన్ కింద వీరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపే వీలు ఉన్నది. కోర్టులో నేరం రుజువైతే జైలు శిక్షతో పాటు, జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

మైనర్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతాయి. జిల్లాలో ఇక నుంచి మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇచ్చినవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ట్రాఫిక్ నియమాల గురించి పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ బి.అనురాధ, సీపీ, సిద్దిపేట

నేడు బర్దీపూర్‌కు మంత్రి దామోదర్ రాక

ఝరాసంగం, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వస్తున్నారని ఆశ్రమ పీఠాధిపతి, వైరాగ్యశిఖామణి అవధూతగిరి మహరాజ్ తెలిపారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలతో పాటు ఆశ్రమ ఆవరణలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, అధికారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం


చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు


సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు




క్యూలైన్లలో భక్తుల రద్దీ







- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.


సమ్మక్కగద్దె

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.

ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

ఆర్కిటెక్చర్ రంగంలో జైకా, ఐఐటీహెచ్ సంయుక్త రూపకల్పనలు


- ఐఐటీహెచ్ వార్షిక ఫెస్ట్‌లో పాల్గొన్న 200 మంది డిజైనర్లు


ఆయాన్ సదస్సును ప్రారంభిస్తున్న ప్రతినిధులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 22: ఆర్కిటెక్చర్, డిజైన్ రంగాల్లో జపాన్ ఇంటర్‌నేషన్ కో ఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) హైదరాబాద్ ఐఐటీ ఇకపై సంయుక్తంగా కృషి చేస్తాయని భారత్ జైకా ప్రతినిధి సైటో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని హైదరాబాద్ ఐఐటీహెచ్‌లో రెండు రోజులుగా డిజైన్ విభాగం ఆధ్వర్యంలో అయాన్ పేరుతో నిర్వహించిన సదస్సును గురువారం ముగిసింది. సదస్సులో 200 మంది యువ జాతీయ, అంతర్జాతీయ డిజైనర్లు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జైకా భారత్ ప్రతినిధి సైటో మాట్లాడుతూ ఆధునికమైన డిజైన్లు, వినూత్న ఆవిష్కరణలపై ఇకపై జైకా సారథ్యంలో టోకియో యూనివర్సిటీ హైదరాబాద్ ఐఐటీలు సంయుక్తంగా కృషి చేస్తాయన్నారు. ఆధునిక సవాళ్లను ఎదుర్కునే నూతన డిజైన్లు, సాంకేతిక పరిజ్ఞానం ఇచ్చిపుచ్చుకోవడంలో సంయుక్తంగా పనిచేస్తామన్నారు. సదస్సులో టోక్యో యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ హిడిటోషీవో హినో, జోసాయ్ యూనివర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ యోజో ఫిజినో ఆర్కిటెక్చర్ రంగంలో తమ 50 ఏళ్ల అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- 'హవానా' ప్రారంభోత్సవంలో బీఎస్ఎన్ఎల్ జీఎం రాజేశ్వరి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజేశ్వరి

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 22 : టెలీకమ్యూనికేషన్స్ రంగంలో 5జీ సాంకేతికతను అమలు చేస్తున్న ప్రస్తుత తరుణంలో స్టార్టప్‌లను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని వర్ధమాన ఇంజనీర్లకు సంగారెడ్డిలోని భారతీయ సంచార నిగం (బీఎస్ఎన్ఎల్) ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ డి.రాజరాజేశ్వరి పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా రుద్రారం సమీపంలోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో హవానా పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సాంకేతిక కార్యక్రమాన్ని గురువారం జ్యోతి ప్రజ్వలనతో ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్‌లో తన ఇరవై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం, అందులో సాంకేతిక పరిజ్ఞానం ఎదిగిన తీరును రాజేశ్వరి వివరించారు. గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి మాట్లాడుతూ ఇటీవల భారత నౌకదళంతో గీతం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందని, త్వరలో వాయుసేనతోనూ అవగాహన ఒప్పందంపై సంతకం చేయబోతున్నట్టు తెలిపారు. సాంకేతికోత్సవంలో దేశ నలుమూలలకు చెందిన 30 కళాశాలల నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏటీఏ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి గంగాధర్, ఫీనిక్స్ గ్లోబల్ సహ వ్యవస్థాపకుడు ఆయుష్ గోస్వామి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాకిలే.. సమ్మక్కసారలమ్మ ఆలయం



కష్టపడితేకానీ కడుపు నిండని జీవులు తీర్థయాత్రకు వెళ్లే స్థోమత లేక, తామున్న చోటే దేవుడిని కొలుచుకుంటున్నారు. దుబ్బాక మండలం పెద్దగుండవెళ్లి గ్రామంలో ఒడ్డెర వాడలో చాలా మంది సమక్క, సారలమ్మ జాతరకు వెళితే మరోకొంత మంది గురువారం పున్నమిరోజు ఇంటి వాకిలిలోనే అమ్మవార్లను వేడుకున్నారు. ఇంటి ఎదుట కల్లాపి చల్లి, వాకిలిలో పసుపు, కుంకుమ్మతో పూదించి కొబ్బరికాయలను నిలిపి సమక్క సారక్కగా కొలుచుకున్నారు. కోడిపిల్ల, మద్యం బాటిల్‌ను ఎదురిచ్చి మొక్కు తీర్చుకున్నారు. ఆ తల్లులు అందరినీ మంచిగా చూసి, వచ్చే ఏటికైనా తన సన్నిధికి రప్పించుకుని, దర్శన భాగ్యం కల్పించాలని వేడుకున్నారు.

- దుబ్బాక, (ఆంధ్రజ్యోతి)ఫిబ్రవరి 22

పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ లక్ష్యం

- ఓటరు నమోదుపై పూర్తి అవగాహన ఉండాలి
- శిక్షణ కార్యక్రమంలో మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 22 : ఓటరు నమోదుపై క్యాంపస్ అంబాసిడర్‌లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో క్యాంపస్ అంబాసిడర్‌లుగా గుర్తించిన విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాంపస్ అంబాసిడర్‌లు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఫారం-6, 7, 8తో పాటు 6ఏ, 6బీలలో నూతన ఓటరుగా నమోదు, మార్పులు, చేర్పులు, పుట్టిన తేదీ, ఫొటో, అడ్రస్, ఆధార్ లింక్‌లను నమోదు చేయాలన్నారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటింగ్ శాతం పెంపు కోసం కళాశాలల్లో రంగోలి, ఉపన్యాస, డ్యాన్స్, నాటకం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ నమోదు లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష చూపితే ఫిర్యాదు చేయాలి

ఆడపిల్లలపై వివక్ష చూపితే టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

కాన్ఫరెన్స్‌హాల్‌లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష జాఢ్యాన్ని రూపుమాపాలంటే వ్యవస్థలో మార్పు రావాలని, అందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. ఆడపిల్లలను చదివిస్తే సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. పాఠశాల విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. తల్లిదండ్రులు, టీచర్లు స్నేహభావంతో ఉన్నప్పుడు సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను వారితో ధైర్యంగా చెప్పగలుగుతారన్నారు. అధికారులు, ఎన్జీవోలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం 'బాలికను బతకనిద్దాం... చదవనిద్దాం, బంగారు తెలంగాణకు బాటలు వేద్దాం' అని కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బేటీ బచావో, బేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఈవో రాధాకిషన్, డీవైఎస్‌వో నాగరాజు, డీడబ్ల్యూవో బ్రహ్మజీ, మెప్మా పీడీ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- సెంట్రింగ్ సామగ్రి చోరికి పాల్పడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు గజ్వేల్ ఏసీపీ బాలాజీ

వర్గల్, ఫిబ్రవరి 22 : సెంట్రింగ్ సామగ్రి చోరికి పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులలో ఇద్దరిని గౌరారం పోలీసులు పట్టుకున్నారు. అశోక్ లీలాండ్ వాహనంతో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ ఏసీపీ బాలాజీ గౌరారం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. వర్గల్ మండలం రాజీవ్‌రహదారి వర్గల్ కమాన్ వద్ద గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరారం ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా అశోక్ లీలాండ్ వాహనం హైదరాబాద్ నుంచి ప్రజ్ఞాపూర్ వైపు వెళుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పోలీసులు పట్టుకుని విచారించారు. నల్గొండ జిల్లా నెరిడిగొమ్ము మండలంలోని పడమటి తండాకు చెందిన ముడావత్ హరి(28), మల్లెపల్లి మండల పరిధి దేవరకొండ గాజీనగర్ గ్రామానికి చెందిన జరపుల రాంలాల్(33)ను అరెస్టు చేశారు. వీరితో పాటు మరో 17 మంది ముఠాలుగా ఏర్పడి సిద్దిపేట, మెదక్ జిల్లాలో భవన నిర్మాణాలు జరిగే చోట సెంట్రింగ్ సామగ్రిని దొంగతనం చేసి హైదరాబాద్‌లోని స్క్రాప్ దుకాణంలో అమ్మేవారు. వారు గౌరారం పోలీస్‌స్టేషన్‌తో పాటు గజ్వేల్, సిద్దిపేట-1టౌన్, సిద్దిపేట-3టౌన్, మెదక్ జిల్లాలోని కౌడిపల్లి, శివంపేట, మెదక్ రూరల్, నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 11 చోట్ల చోరీలకు పాల్పడ్డారు. మరో 17 మంది ముఠా సభ్యులు పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఏసీపీ తెలిపారు.

జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆగమ సాయిచరణ్


సాయిచరణ్

జహీరాబాద్, ఫిబ్రవరి 22 : నామినేటెడ్ పోస్టుల భర్తీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం జహీరాబాద్ వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీని ఖరారు చేసింది. చైర్మన్‌గా ఆగమ సాయిచరణ్‌ను నియమించింది. ఉపాధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి, సభ్యులుగా కలాల్ నరేష్‌గౌడ్, కిషన్‌రాథోడ్, అల్లారి వంశీరాజ్, కండెం సుజాత, మహ్మద్ జాఫర్, బోయిని శేఖర్, ఎం.అశోక్, మహ్మద్ అఖిల్ అహ్మద్, అంజద్‌మియా, పట్లోళ్ల మల్లారెడ్డి, రాయికోడ్ నర్సింలు, శంకరప్పపాటిల్‌ను నియమిస్తూ మార్కెటింగ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. బీఆర్ఎస్ హయాంలో ఐదారేళ్లుగా కమిటీని ఏర్పాటు చేయలేదు.

ఇవి.. వనాలేనా?

- ఎండిపోయిన మొక్కలు ● నిర్వహణ లేక నిరుపయోగం

మద్దూరు, ఫిబ్రవరి 22 : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి, బృహత్ పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని 23 గ్రామపంచాయతీల్లో గ్రామాలకు దగ్గరగా కొన్ని, దూరంగా మరికొన్ని స్థల లభ్యతను బట్టి ఐదు గుంటల నుంచి ఎకరంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. దూళిమిట్ట, మద్దూరు, నర్సాయపల్లి, మర్మాములలో బృహత్ పల్లె ప్రకృతి వనాలున్నాయి. ఉపాధిహామీ ద్వారా రెండేళ్ల మేంటెనెన్స్ పూర్తవ్వడంతో గ్రామ పంచాయతీలు ప్రకృతి వనాల నిర్వాహణ బాధ్యతలను విస్మరించడంతో ఇవి వృథాగా మారుతున్నాయి.

నాడు మొక్కల కొనుగోలులో అవకతవకలు

పల్లె ప్రకృతి వనంలో సుమారు 1800 నుంచి 2 వేలు, బృహత్ పల్లె ప్రకృతి వనంలో 10 నుంచి 12 వేల మొక్కలను నాటినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లోని మొక్కలే కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి ఒక్కో మొక్కకు సుమారు రూ.250పైనే వెచ్చించారు. గ్రామపంచాయతీ నిధులు ఖర్చు చేసి మొక్కలను కొనుగోలు చేశారు. మొక్కల కొనుగోలులో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో ఇన్‌చార్జీ ఎంపీడీవోగా పనిచేసిన అప్పటి పంచాయతీ విస్తరణాధికారి హస్తం ఉన్నట్లు ఆరోపిస్తూ బదిలీ చేశారు.

రెండేళ్ల మేంటెనెన్స్‌కు రూ.58.53 లక్షలు

ఉపాధిహామీ ద్వారా రెండేళ్ల నిర్వహణ చేపట్టగా మొక్కల సంరక్షణకు వాచర్లను నియమించారు. పల్లె ప్రకృతి వనాలకు ఒకరు, బృహత్ పల్లె ప్రకృతి వనాలకు ఇద్దేరిసి చొప్పున తీసుకున్నారు. ఒక్కో వాచర్‌కు రోజుకు నెలకు రూ.6,168 చెల్లిస్తున్నారు. రెండేళ్లకు వాచర్లకు రూ.47.37 లక్షల జీతాలు చెల్లించారు. మొక్కలకు ట్యాంకర్ ద్వారా అందించే నీరే దిక్కుగా మారాయి. పల్లె ప్రకతి వనానికి నెలకు మూడు ట్యాంకర్లు, బృహత్ పల్లె ప్రకృతి వనాలకు ఆరు చొప్పున ట్యాంకర్‌ల ద్వారా నీటిని అందించారు. 93 ట్యాంకర్లకు నెలకు రూ.46,500 చొప్పున రెండేళ్లకు రూ.11.16 లక్షలు ఖర్చు చేశారు. రెండేళ్ల నిర్వహణ కోసం దాదాపుగా రూ.58.53 లక్షలను ఖర్చు చేశారు. అయితే ఉపాధిహామీ ద్వారా రెండేళ్ల మేంటెనెన్స్ పూర్తవ్వడంతో మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. గ్రామపంచాయతీ నిర్వహణ చర్యలను చేపట్టకపోవడంతో వనాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి.







మొక్కలే లేని మర్మాములలోని బృహత్ పల్లె ప్రకృతి వనం, ప్రకృతి వనంలో నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు, రేబర్తిలో గేటు వద్ద మురుగు నీరు


మద్దూరు మండలంలోని కూటిగల్‌లో సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తున్న పూజారులు


నంగునూరు మండలం అక్కెనపల్లి సమ్మక్క గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


చిన్నకోడూరు మండలం కిష్టాపూర్‌లో సమ్మక్కను ఊరేగింపుగా గద్దెకు తీసుకువస్తున్న కోయపూజారులు

గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ

● **మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

బెజ్జంకి, ఫిబ్రవరి 22: భక్తుల కోరిన కోరికలు తీర్చే సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లు గురువారం గద్దెలపై కొలువుదీరారు. బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి, తోటపల్లి, వడ్లూరు, గుండారం గ్రామాల్లో జాతర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మక్క, సారలమ్మ జాతరల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్లి గద్దెల వద్ద కొలువు తీర్చారు.

●**మద్దూరు:** దూళిమిట్ట మండలం కూటిగల్‌లో గురువారం సమ్మక్క తల్లి గద్దెకు చేరుకున్నది. కోయపూజారుల పూజల అనంతరం ఊరేగింపుగా గ్రామస్థులు సమ్మక్కతల్లిని గద్దెకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారికి భక్తి ప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోమ బాలమణిబాలకృష్ణ, కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

●**నంగునూరు:** నంగునూరు మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో సమ్మక్క - సారలమ్మ జాతరలో భాగంగా గురువారం పులి గుండ్ల నుంచి సమ్మక్క గద్దెకు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు. కాగా శనివారం సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లు తిరిగి వన ప్రవేశం చేసేంత వరకు భక్తుల సందడి ఉంటుందని తెలిపారు

●**చిన్నకోడూరు:** మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమైంది. జాతరలో భాగంగా సంప్రదాయ బద్ధంగా బుధవారం రాత్రి కంకవనం నుంచి సారలమ్మను సమ్మక్కను కోయ పూజారులు, గ్రామస్థులు గద్దెలపై ప్రతిష్ఠించారు.

●**చేర్యాల:** సమ్మక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో కొమురవెల్లి మండలకేంద్రం శివారులోని గద్దెల మీద గురువారం రాత్రి సమ్మక్క కొలువుదీరింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారం సమర్పించారు. అమ్మవార్లకు ఒడిబియ్యం పోసి తమ పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా కాపాడమని వేడుకున్నారు.

హుస్నాబాద్/హుస్నాబాద్ రూరల్/అక్కన్నపేట ఫిబ్రవరి 22 : హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో ఉన్న సమ్మక్క, సారలమ్మ గద్దెలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. దీనికి ముందు హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ సరోజన మంత్రి పొన్నంకు ఎత్తు బంగారాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రజలకు అందాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు. పొట్లపల్లిలో సమ్మక్క, సారక్కను గురువారం రాత్రి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రాష్ట్ర ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను మొక్కుకున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం అక్కన్నపేట మండలం గోవర్ధన గిరిలోని సంజీవరాయ గుట్ట పైన శ్రీ సమ్మక్క సారలమ్మ వార్లను మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎత్తు బంగారం సమర్పిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 22: మర్కుక్ మండలం ఎర్రవల్లి వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రవల్లి గ్రామానికి చెందిన బత్తుల రాజు(28) ఇంటి నుంచి ట్రాక్టర్‌పై వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో రాజు ఎగిరి కిందపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.


మృతిచెందిన రాజు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

ములుగు, ఫిబ్రవరి 22: ఆర్థిక ఇబ్బందులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన చెట్టి నాగరాజుగౌడ్(30) కూలి పనులు చేసుకునేవాడు. ఈ మధ్యలో పని దొరక్కపోవడంతో మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. కాగా ఈ నెల 16న జీవితంపై విరక్తి చెందిన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గజ్వేల్‌కు తరలించి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శేఖర్ తెలిపారు.


నాగరాజుగౌడ్ (ఫైల్)

కుకునూరుపల్లి పీహెచ్‌సీని సందర్శించిన ఒడిస్సా వైద్య బృందం


కుకునూరుపల్లి పీహెచ్‌సీ వద్ద ఒడిస్సా వైద్య బృందం

కొండపాక, ఫిబ్రవరి 22: కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఒడిస్సా వైద్య బృందం గురువారం సందర్శించింది. రాష్ట్రంలో అమలవుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం నిర్వహణ, ఓపీ సేవలు, చిన్న పిల్లలకు టీకాలు, డెలివరీలతో పాటు ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో పలు విషయాలను బృందానికి వివరించారు. ఇందులో వైద్యులు డాక్టర్ బలబీర్ సింగ్, డాక్టర్ ఫరీన్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాల్లో ఇబ్బందులు రావొద్దు

● **జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ**

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 22: సాగుకు విద్యుత్ సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దని, , విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో రెండో రోజు ఆమె అధ్యక్షతన జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం పనులు, ఆర్థిక, ప్రణాళికలులలోని ఎజెండా అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని, బాల్య వివాహాలు జరగకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆమె అధికారులను సూచించారు. సంక్షేమ హాస్టల్లో ఉన్న పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. దుర్గాబాయి మహిళా భవనం పూర్తిస్థాయిలో మహిళలకు ఉపయోగపడే విధంగా వాడుకలోకి తీసుకురావాలన్నారు. చేర్యాల- జనగామ, సిద్దిపేట-మెదక్, హుస్నాబాద్ -కరీంనగర్ జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ రమేష్, జడ్పీ స్థాయీ సంఘాల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రోజా రాధాకృష్ణ శర్మ

మీ పిల్లలను శ్రద్ధగా చదివించండి

●**ఎమ్మెల్యే హరీశ్ రావు**

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 22 : మీ బిడ్డ టెన్త్‌లో ఫస్ట్ రావాలనీ, సిద్దిపేటకు పేరు తేవాలని, మార్చి 18 నుంచి మీ బిడ్డ పదవ తరగతి పరీక్ష రాయబోతున్నాడని, ఈ నెల రోజులు మరింత శ్రద్ధగా చదివించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గ 10వ తరగతి విద్యార్థుల తల్లితండ్రులతో, విద్యాధికారులతో, ఉపాధ్యాయులతో గురువారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల రోజులు మీ పిల్లలను చదివించి మంచి మార్కులు వచ్చేలా చూడాలన్నారు. టీవీలు బంజేయాలని, ఫంక్షన్‌లకు దూరం ఉంచాలని, పొద్దున్న 4 గంటలకు నిద్ర లేపి చదివించాలని సూచించారు. తన స్వంత డబ్బులతో సాయంత్రం స్నాక్స్ ఏర్పాటు చేశానని, ఇంట్లోనే అర్థం కాని సబ్జెక్టును వినేలా డిజిటల్ కంటెంట్ బుక్స్ కూడా పంపించానన్నారు. మంచి మార్కులు సాధిస్తే తనకు తన బిడ్డ పాస్ అయింది అనేలా సంతోషం కలుగుతుందని అన్నారు. సిద్దిపేటకు పేరు తేవాలని తన ఆకాంక్ష అని తెలియజేశారు. మీ పిల్లలో ఆత్మ విశ్వాసం నింపాలని, మనో ధైర్యం కలిగించాలని సూచించారు. ఈ నెల రోజులు విద్యార్థులను స్కూల్‌కు ప్రతీ రోజు పంపించాలని, ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. 10వ తరగతి భవిష్యత్‌కు పునాదని, భవిష్యత్‌లో పై చదువులకు, ఉద్యోగానికి ఇతే ముఖ్యమని చెప్పారు.


ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

'సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి'

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22: ఆయిల్‌పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ సంచాలకుడు సురేష్, సీనియర్ శాస్త్రవేత్త రామచంద్రుడు అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో రైతు ఎల్లాగౌడ్ సాగుచేసిన ఆయిల్‌పామ్ తోటను పరిశీలించి అక్కడి రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ తోటల సాగుకు అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో 11 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగులో ఉన్నాయని, వచ్చే ఆగస్టులో 2500 ఎకరాల్లో పంట చేతికొస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేసేందుకే 'గావ్ చలో అభియాన్'

● **బీజేపీ నాయకులు**

కోహెడ, ఫిబ్రవరి 22 : గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీని మరింత బలోపేతం చేసి, మోదీ ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడానికే పార్టీ జాతీయ నాయకత్వం గావ్ చలో అభియాన్ కార్యక్రమం చేపట్టిందని ఆ పార్టీ పార్లమెంటరీ ప్రభారీ మీసాల చంద్రయ్య, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావులు పేర్కొన్నారు. గురువారం కోహెడలో బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశానికి వారితో పాటు అసెంబ్లీ ప్రభారీ గుజ్జ సత్యనారాయణరావు, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీసాల చంద్రయ్య మాట్లాడుతూ.. కోహెడలో 26 న జరిగే ప్రజాహిత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇంచార్జిలు ఎర్రం మహేష్, అలివెల్లి సమ్మిరెడ్డి, వాసుదేవ రెడ్డి, ఏనుగుల సందీప్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజాహిత యాత్ర వివరాలు

హుస్నాబాద్ నియోజకవర్గంలో కోహెడ మండల కేంద్రం నుంచి ఈ నెల 26న బీజేపీ ప్రజాహిత యాత్ర ప్రారంభమవుతుందని బీజేపీ పార్లమెంటరీ ప్రభారీ మీసాల చంద్రయ్య తెలిపారు. ఆయన కోహెడలో విలేకరులతో మాట్లాడారు. 26న కోహెడ, తీగలకుంటపల్లి, గొట్లమిట్ల, నారాయణపూర్, విజయనగరం కాలనీ గ్రామాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర రెండవ విడతను కొనసాగిస్తారన్నారు. దామెర, చింతలపల్లి, ఎల్కతుర్తి సూరారం దండె పల్లి గ్రామాల్లో ఈ నెల 28 వరకు ఈ ప్రజాయిత కార్యక్రమం ఉంటుందనీ ఆయన వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పార్లమెంటరీ ప్రభారీ మీసాల చంద్రయ్య

చదువుతోనే సమాజంలో గుర్తింపు: ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 22: చదువుతూనే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. కొండపాక మండలం దుద్దెడ జాగృతి అసోసియేషన్ 25 వసంతాల సందర్భంగా గురువారం ఓ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే ఉపాధ్యాయుడు రాసిన 'లైఫ్ కిల్స్- విత్‌ఔట్ స్కిల్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, అందుకు అనుగుణంగా కష్టపడి చదివి జీవితంలో మంచిపేరు ప్రతిష్ఠలు తెచ్చుకోవాలన్నారు. ఆదర్శమూర్తుల అడుగుజాడల్లో నడుస్తూ సమాజ నిర్మాతలుగా తయారు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులు, ఎంపీటీసీ బాలాజీ, జాగృతి అసోసియేషన్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో వివాదం

కొండపాక, ఫిబ్రవరి 22: కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో అధికారుల నిర్లక్ష్యంతో వివాదం తలెత్తింది. గ్రామానికి చెందిన 1061 సర్వే నెంబర్లు 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నదని, అది పూర్తిగా సర్వేచేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని గ్రామ అవసరాలకు కేటాయించాలని గ్రామస్థులు ఎంపీటీసీ యాదగిరి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల నుంచి మొదలుపెడితే ప్రజాభవన్ వరకు దరఖాస్తులు ఇచ్చారు. కానీ రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామంలో వివాదం తలెత్తింది. తమకు గతంలో భూమి కేటాయించారని కొంతమంది గురువారం అక్కడికి చేరుకోవడంతో గ్రామస్థులకు, వారికి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఇరువర్గాల వారు గొడవకు దిగారు. వెంటనే రెవిన్యూ అధికారుల స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే గ్రామంలో వివాదాలు పెరుగుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు.


ఖమ్మంపల్లిలో గొడవ పడుతున్న ఇరువర్గాల వారు

రోడ్లపై కూరగాయల విక్రయాలను నిలిపివేయండి

● **సమీకృత మార్కెట్ వ్యాపారులు**

గజ్వేల్, ఫిబ్రవరి 22: రోడ్లపై కూరగాయల విక్రయాల్ని నిలిపివేయించాలని గజ్వేల్ సమీకృత మార్కెట్ కూరగాయల సంఘం సభ్యులు కోరారు. నాలుగేళ్లుగా సమీకృత మార్కెట్‌లో వ్యాపారాలు చేస్తున్నా, సంపూర్ణ వ్యాపారం జరగడం లేదని, తాజాగా కూరగాయల దుకాణాలు రోడ్లపైకి రావడంతో వ్యాపారం మరింత దెబ్బతిన్నదని ఆవేదన చెందుతున్నారు. వారు సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ నరసయ్య, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీలకు వినతిపత్రాలను అందజేశారు. దీంతో సాయంత్రం వరకు కూరగాయల వ్యాపారాన్ని నిలిపివేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు కొలిచెలిమే స్వామి, అధ్యక్షుడు వేల్పుల రాంచంద్రం, ఉపాధ్యక్షుడు కొలిచెలిమే నరేశ్, ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు మాట్లాడుతూ.. సమీకృత మార్కెట్ ప్రారంభించిన రోజున పలు నిబంధనలు తెలిపారని, దాని ప్రకారమే తాము అంగీకరించి, వ్యాపారాలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కిలోమీటరు దూరంలో ఎవరూ కూరగాయలు అమ్మరాదని, అమ్మితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని చెప్పారన్నారు. ఇకనైనా తమ సమస్యలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.


ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వ్యాపారులు

విద్యార్థుల నీళ్ల క్యాన్ల మోతపై స్పందించిన అధికారులు

● **హెచ్‌ఎం రాజమల్లయ్యను సంజాయిషీ కోరిన డీఈవో**

చేర్యాల, ఫిబ్రవరి 22: దాహార్తి తీర్చుకునేందుకు కొమురవెల్లి మండలం ఐనాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వాటర్ క్యాన్లను పాఠశాలకు మోసుకుంటూ ఇబ్బందులు పడుతున్న విషయమై విద్యాశాఖాధికారులు స్పందించారు. ఈ సందర్భంగా సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం పాఠశాల హెచ్‌ఎం రాజమల్లయ్యను డీఈవో ఆఫీసుకు పిలిపించుకుని విచారణ చేపట్టారు. స్కావెంజర్లు లేని కారణంగా విద్యార్థులతో వాటర్‌క్యాన్లు మోపించడం సరికాదని, వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. మళ్లీ పునరావృతమైతే చర్యలు తప్పవని మందలించారు.


హెచ్‌ఎం రాజమల్లయ్యను విచారిస్తున్న డీఈవో

కొమురవెల్లిలో జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలి

చేర్యాల: కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

మద్దూరు: మండలంలోని సలాఖ్‌పూర్, మర్మాముల, ధర్మారం గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ గురువారం పరిశీలించారు. తప్పనిసరిగా మొక్కలకు నీళ్ల పట్టించాలని పేర్కొన్నారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని మసలుకోవాలి

చేర్యాల/మిరుదొడ్డి: తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థులు మసలుకుని, క్రమశిక్షణతో చదువులో రాణించాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. చేర్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మానవ అక్రమ రవాణా, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై ఎస్ఐ భువనేశ్వర్ అవగాహన కల్పించారు.

'రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి'

దుబ్బాక: ప్రతిఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీంశేఖర్ అన్నారు. గురువారం దుబ్బాకలోని కేసీఆర్ స్కూల్‌లో గతనెలలో రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలను నిర్వహించిన విషయం తెలిసిందే.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

● **సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య**

గజ్వేల్, ఫిబ్రవరి 22: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్‌లో నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గడిచిన నాలుగేళ్లలో పెట్టిన ఖర్చుల వివరాలను బయటపెట్టాలని, రెండు రోజులుగా స్థానిక కౌన్సిలర్లు పనులు పూర్తిగా కాకముందే నిధులు కాజేశారని తెలిపినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. ఈ విషయంపై స్వతంత్ర కమిషన్ ద్వారా పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలన్నారు.

ప్రజా ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం

● **కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొప్పదండి చంద్రశేఖర్**


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

నారాయణరావుపేట, ఫిబ్రవరి 22: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయకుడు సొప్పదండి చంద్రశేఖర్ అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నక్క కాంతయ్య, అధ్యక్షుడిగా బోయిని బాలయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సారుగు హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా మాట్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా మోసర్ల భూపతి రెడ్డి, కార్యదర్శులుగా జక్కుల బుచ్చయ్య, దాకం కనకయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు రాజేశంగౌడ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు

● **గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఆర్.భానుప్రకాశ్**

గజ్వేల్, ఫిబ్రవరి 22: విద్యుత్ సరఫరాలో ఏలాంటి అంతరాయం ఉండదని గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఆర్.భానుప్రకాశ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని డీఈ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి, ఇటు గృహా అవసరాలకు విద్యుత్‌ను అందిస్తామన్నారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా సరిపడే విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, యాసంగి సీజన్‌కు రైతాంగానికి ఇబ్బందులు లేకుండా విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు.

కమనీయం.. కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణం

నంగునూరు, ఫిబ్రవరి 22: నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. మాజీ సీఎం కేసీఆర్ సెంటిమెంట్ ఆలయంగా చెప్పుకునే ఈ ఆలయంలో కుంకుమార్చన, హోమం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవానికి గ్రామ ప్రజలే కాకుండా సిద్దిపేట, కొండపాక, చేర్యాల, మద్దూరు, హుస్నాబాద్ మండలం నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


వేంకటేశ్వరస్వామి కల్యాణంలో భక్తులు

రేపటి నుంచి బెక్కల్ రామలింగేశ్వరస్వామి జాతర

మద్దూరు, ఫిబ్రవరి 22: దూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమై మార్చి 8 వరకు కొనసాగనున్నాయి. రామాచల గుట్టపై క్రీ.శ. 1117లో రామలింగేశ్వరస్వామి, మల్లికార్జునస్వామి ఆలయాలను నిర్మించారు. ఆలయ సమీపంలో పోచమ్మతల్లి, అభయాంజనేయస్వామి ఆలయాలున్నాయి. నాటి నుంచి భక్తుల పూజలందుకుంటూ స్వామివారు దేదీప్యమానంగా వెలుగొందుతున్నారు. ఈ నెల 24న స్వామివారి మేలుకొలుపుతో జాతర ప్రారంభంకానున్నది. 29న స్వామివారికి గంగాస్నానం, ఉదయం 11.45 నిమిషాలకు అభిజిత్ లగ్నమున భ్రమరాంబ సమేత రామలింగేశ్వస్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం, రాత్రి బెక్కల్ కళాకారులచే ఒగ్గుకథ, మార్చి 4న భద్రకాళి సమేత వీరభద్రస్వామి ప్రస్థాయం, బియ్యం సుంకు, రాత్రి 10 గంటలకు భద్రకాళి అమ్మవారి ఆవాహనవ పూజలు, 8న మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ సమయంలో రామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పెద్దపట్నం గ్రామస్థుల బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.



బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ తోరణం, గర్భాలయంలో వెలిసిన రామలింగేశ్వరస్వామి

గంగోత్రి టూ రామేశ్వరం

● **సాష్టాంగ నమస్కారం చేస్తూ యాత్ర చేస్తున్న సాధువు**

కొండపాక, ఫిబ్రవరి 22: ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లడం అంటేనే ఒక గగనం. అలాంటిది ఓ సాధువు సాష్టాంగ నమస్కారాలు చేస్తూ వేల కిలోమీటర్ల యాత్ర చేయడానికి సంకల్పించాడు. సుమారు మూడువేల కిలోమీటర్లు యాత్ర సంకల్పానికి వెళ్తున్న క్రమంలో కొండపాక మండలం దుద్దెడ వద్ద కనిపించాడు. రాజగిరి మహరాజ్ అనే సాధువు సాష్టాంగ నమస్కారం చేస్తూ వెళ్తున్నాడు. గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు వెళ్తున్నానని ఈ సందర్భంగా తెలిపాడు.


సాష్టాంగం చేస్తూ వెళ్తున్న సాధువు

'గృహజ్యోతి'కి దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, ఫిబ్రవరి 22: ప్రభుత్వం అమలుచేయనున్న ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకానికి శుక్ర, శనివారాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని చేర్యాల ఏడీఈ రత్నాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబరు వివరాలతో ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కుంకుమార్చన, అభిషేకాలు

గజ్వేల్, ఫిబ్రవరి 22: గజ్వేల్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజున గణపతి పూజ, స్వస్తి వాచనము, అమ్మవారికి ఆవు పాలతో అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున హాజరై మంగళహారతిని అందించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.